# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# వృద్ధుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

## మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



దివ్యాంగుల ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 7 ప్రభాతవార్త:** వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే సాధారణ ప్రజావాణి కి రాలేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ప్రతినెల మొదటి బుధవారం స్థానిక అర్బన్ తహిసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో ఆమె వృద్ధులు, దివ్యాంగుల నుండి వారు ఎదుర్కొంటున్న సమస్యల పై దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఇందులో తనకు గృహ జ్యోతి పథకం వర్తింపజేయాలని ఒక దివ్యాంగుడు కోరగా, తనకు ఇల్లు లేదని ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని ఒక వృద్ధుడు కోరాడు. వికలాంగులకు కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని వికలాంగుల సంఘం విజ్ఞప్తి చేసింది. అంతకు ముందు జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం గతంలో వచ్చిన ఫిర్యాదులపై సమగ్రంగా కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో నర్సింహులు, ఆర్డీవో నవీన్, ఆర్టీసీ అధికారి వహీద్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించాలని ప్ల కార్డులు ప్రదర్శిస్తున్న పోలీసు అధికారులు

# నో హెల్మెట్ .. నో ఎంట్రీ టు కలెక్టరేట్

- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి
- రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి 7 ప్రభాతవార్త:** ఇకపై ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించకుండా జిల్లా కలెక్టర్ కార్యాలయం లోనికి ప్రవేశం లేదు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి నిర్ణయం మేరకు కలెక్టరేట్‌లోకి హెల్మెట్ లేకుండా లోనికి ప్రవేశించే ద్విచక్ర వాహనదారులను గత రెండు రోజులుగా అనుమతించడం లేదు. రెవెన్యూ అదనపుకలెక్టర్ మధుసూదన్ నాయక్ కలెక్టరేట్ ప్రవేశ ద్వారం వద్ద రవాణాశాఖ సిబ్బందితో కలిసి పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి1నుండి 31వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలు పాటింపు, రోడ్డు భద్రతపై అవగాహన కలిగించేందుకు రవాణా శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ లేని కారణంగా తలకు ప్రమాదం సంభవించి అనేక మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలని, హెల్మెట్ ధరించడం వలన ప్రాణాలకు రక్షణగా ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చే అధికారులు, ఉద్యోగులు, ప్రజలు తప్పక హెల్మెట్ ధరించి రావాలని, అదే విధంగా నాలుగు చక్రాల వాహన దారులు సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. కలెక్టర్ కార్యాలయం లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది అందరికీ ఆదర్శంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్‌తో పాటు జిల్లా రవాణా అధికారి రఘు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సువర్ణ రాజ్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, ఆర్‌టిఏసభ్యులు సలీం, రవాణాశాఖ, కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు.

# మున్సిపాలిటీలకు రూ.45కోట్లు విడుదల

## మాజీ ఎమ్. ఎల్. ఏ. ను సన్మానించిన నాయకులు

**అలంపూర్ జనవరి 7, ప్రభాతవార్త :** మున్సిపాలిటీలకి రూ.45కోట్ల నిధులను విడుదల చేయించిన మాజీ ఎమ్ ఎల్ ఏ., ఏ. ఐ. సి. సి. కార్యదర్శి డాక్టర్ ఎస్. ఏ. సంపత్ కుమార్ ని బుధవారం శాలువ కప్పి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేసిన రాష్ట్ర కన్వీనర్ (ఎస్. సి. విభాగం) వడ్డేపల్లి దేవేంద్ర, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి సారథ్యంలోనీ ప్రజాప్రభుత్వం అభివృద్ధి పథంలో అలంపూర్ నియోజవర్గం మూడు మున్సిపాలిటిలు, వడ్డేపల్లి, అయిజ, అలంపూర్ అభివృద్ధిల కొరకు ఒక్కో మున్సిపాలిటీ రూ.15 కోట్ల చొప్పున రూ.45 కోట్ల నిధులను ఎస్. ఏ. సంపత్ కుమార్ విడుదల చేశారన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో అభివృద్ధి పనుల కొరకు తాను ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు. కనుక రేపు జరగబోయే స్థానిక మున్సిపల్ ఎలక్షన్లలో అత్యధిక భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. తద్వార మున్సిపాలిటీల అభివృద్ధి కొరకు ఇంకా ఎక్కువ నిధులను తీసుకవస్తానని తెలియజేశారు. ప్రతి కార్యకర్తకి తను అన్ని విధాలుగా తోడు ఉంటానని ఎస్. ఏ. సంపత్ కుమార్ తెలియజేశారు.



డివిజన్లలో అభ్యర్థిగా పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పిస్తున్న అభ్యర్థులు

# 60 డివిజన్లు.. 376 దరఖాస్తులు

- కాంగ్రెస్ కార్పొరేటర్‌కు ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ
- డివిజన్లలో పర్యటనకు డీసీసీ టీమ్‌లు

**మహబూబ్‌నగర్ జనవరి 7 ప్రభాతవార్త :** కార్పొరేషన్లోని 60 డివిజన్లకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయాలనుకునే అభ్యర్థులు వ్యక్తిగత వివరాలతో కూడిన దరఖాస్తులు అందజేయాలని ఈనెల5న పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ సూచించారు. డివిజన్లలో అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఆశావాహులు పోటాపోటీగా కార్యాలయంలో కోఆర్డినేటర్లకు దరఖాస్తులు అందజేశారు. చివరిరోజు బుధవారం సాయంత్రం వరకు 5గంటల వరకు 60 డివిజన్లకుగాను 376 దరఖాస్తులు వచ్చాయి. పర్యటనలకు డీసీసీ టీమ్‌లు కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో డివిజన్లలో పార్టీ నాయకులు పర్యటించేలా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ డీసీసీ టీమ్‌లు ఏర్పాటు చేశారు. 1 నుంచి 12 డివిజన్లకు ముడాచైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ – మిగతా4లో..

# దివ్యాంగులకు ప్రభుత్వ సహకారం



కేక్ కట్ చేస్తున్న అంద ఉపాధ్యాయురాలు

- క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన దివ్యాంగులను స్ఫూర్తిగా తీసుకోవాలి
- కళ్ళు లేని వారికి స్పర్శ ద్వారా చదువుకునే అవకాశం
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నా రెడ్డి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి7 ప్రభాతవార్త:** దివ్యాంగులకు అన్ని విధాలుగా ప్రభుత్వ సహకారం ఉంటుందని, సకలాంగులతో పోటీ పడుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో జిల్లాలోని 730 మంది దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలపంపిణీ కార్యక్రమానికి ప్రణాళికసంఘం అధ్యక్షుడు, స్థానిక శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, ఆలింకో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, గ్రిడ్ కార్యనిర్వాహక సంచాలకులు యం. కె. రమేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు తాము తప్పు చేయడం వల్ల అంగ వైకల్యం రాదని, శిశువు గర్భంలో ఉన్నప్పుడు జన్యుపరమైన సమస్యల వల్ల లేదా పోలియో వ్యాధి వల్ల వస్తుందన్నారు. తమ మిత్రులలో ఒకరు దివ్యాంగుడు అయితే ఇతర స్నేహితుల కంటేదివ్యాంగుడైన స్నేహితుడిని ఎక్కువగా ప్రేమ ఆప్యాయతలు చూపాలని సవ్యాంగులకు సూచించారు. కళ్ళు లేని వారికి స్పర్శ ద్వారా చదువుకునే అవకాశం కల్పించిన లూయిస్ బ్రెయిలీ, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహిత జైపాల్ రెడ్డి, దివ్యాంగులైన ఐఎఎస్, క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన దివ్యాంగులను స్ఫూర్తిగా తీసుకొని దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదని నిరూపించాలని ఉద్బోధించారు. రాష్ట్రస్థాయి ప్రజావాణికి దర ఖాస్తులు తీసుకొని వచ్చే దివ్యాంగుల సమస్యలకు మొదటి ప్రాధాన్య ఇచ్చి పరిష్కరిస్తున్నామని తెలియజేశారు. దివ్యాంగులను పెళ్లి చేసుకుంటే ప్రభుత్వం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. గత సంవత్సరం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ భవనానికి 1000 గజాల స్థలం కేటాయించడం జరిగిందని, అట్టి స్థలంలో భవన నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నట్లు తెలియజేశారు. దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదని, సమాజంలోని అన్ని రంగాల్లో సకలాంగులతో సమానంగా పోటీ పడుతున్నారని కొనియాడారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొంత ఆలస్యం అయినప్పటికి దివ్యాంగులకు ఇస్తామని ఏదైతే మేనిఫెస్టోలో పొందుపరిచామో వాటిని ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో జిల్లాలోని 730 మంది దివ్యాంగులకు రూ. 70.73 లక్షల విలువగల ఉపకరణాలు ఉచితంగా అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వైకల్యం అనేది శరీరానికి మాత్రమే కానీ అనుకున్న లక్ష్య సాధనకు కాదని, దివ్యాంగులు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలు సాధించాలని సూచించారు. వీటిలో బ్యాటరీ ట్రై సైకిల్ 97, వినికిడి యంత్రాలు 44, చంక కర్రలు 178 అడ్జస్టబుల్ వాకింగ్ స్టిక్ 108, ట్రై సైకిల్ 149, టిఎల్ఎం కిట్ 30 వంటి ఉపకరణాలు 728 మందికి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, డిడబ్ల్యుఒ సుధారాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జలుద్దిన్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, దివ్యాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మీసాల మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తుడి మెగారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

# ఆంధ్రకు మేలు చేసేలా కాంగ్రెస్ పాలన

- బిఆర్ఎస్ హయాంలోనే ముడా ఏర్పాటు
- కార్పొరేషన్ ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేయాలి
- కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త :** ముడా, మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేశామని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్‌జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మహబూబ్ నగర్ పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. అధికారులు రిజర్వేషన్ లాటరీ తీసే టైంలో నాయకులు అప్రమత్తంగా ఉండాలని, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికీ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం సమిష్టిగా పనిచేయాలని, పోటీకి అవకాశం రానివారికి భవిష్యత్‌లో మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లేని లోటు ప్రజలకు కనిపిస్తుంది. గ్రామాల్లో పర్యటనకు వెళ్తే ప్రజలు సమస్యలు ఏకరువు పెడుతున్నారని, మళ్ళీ బీఆర్ఎస్ అధికారం లోకి వస్తుందని వారే చెబుతున్నారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో విద్య, వైద్యం ఉపాధి రంగలకు ప్రాధాన్యత ఇచ్చామని, మెడికల్ కాలేజీతో పాటు వెయ్యి పడకల అస్పత్రి తీసుకువచ్చామని గుర్తు చేశారు. హైదరాబాద్ తో సమాంతరంగా మహబూబ్ నగర్ అభివృద్ధి చేస్తామని మాజీ మంత్రి పేర్కొన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ఆంధ్ర ప్రాంతానికి మేలు చేసేవిధంగా కాంగ్రెస్ పాలన సాగుతుందని ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్, గ్రంధాలయం సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, సీనియర్ నాయకులు గణేష్, శ్రీనివాస్ రెడ్డి, అనంత రెడ్డి, అన్వర్ పాష, రెహమాన్, ఆంజనేయులు, ప్రవీణ్, నరేందర్, రాము, వేదవత్, నవకాంత్, కిషోర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యంతరాలను నిర్ణీత గడువులో పరిష్కరించాలి

- ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ పూర్తి చేయాలి
- రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఐ. రాణి కుముదిని
- జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి




వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులు ( ఇన్‌సెట్లో ) రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఐ. రాణి కుముదిని

**వనపర్తి, జనవరి 7 ప్రభాతవార్త :** మున్సిపాలిటీ ఓటర్‌జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ పూర్తి చేసి సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఐ.రాణి కుముదిని అన్నారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ పూర్తి చేసి సన్నద్ధం కావాలని అన్నారు. ఈనెల 12 వ తేదీ నాడు వార్డుల వారిగా ఫోటోతో కూడిన ఎలక్ట్రోరల్ జాబితా ప్రచురించడంతో పాటు 13వతేదీన డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలను ప్రచురించడం జరుగుతుందని వివరించారు. 16వ తేదీన తుది పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రచురించి, పోలింగ్ కేంద్రాల వారిగా ఫోటో ఎలక్టోరల్ జాబితా ప్రచురించడం జరుగుతుందని అన్నారు. పురపాలక ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర యంత్రాంగం సిద్ధం చేసుకోవాలని అన్నారు. వీసీలో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 12వ తేదీ నాడు వార్డుల వారిగా ఫోటోతో కూడిన ఎలక్ట్రోరల్ జాబితా ప్రచురించడంతో పాటు, 16వ తేదీన తుది పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రచురించి, పోలింగ్ కేంద్రాల వారిగా ఫోటో ఎలక్టోరల్ జాబితా ప్రచురించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా పురపాలక ఎన్నికలకు సంబంధించి ప్రతి మున్సిపాలిటీ పరిధిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ సెంటర్‌లను గుర్తించాలని, కౌంటింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసేందుకు సన్నద్ధత కావాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సమీక్షలో పాల్గొన్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

# వార్డుల వారీగా ఓటర్ల జాబితా పకడ్బందీగా చేపట్టాలి

## - నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 7 ప్రభాతవార్త:** బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని, జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు 2వసాధారణ ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణ, ఇతర సంబంధిత అంశాలపై ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయం నుండి అదనపు కలెక్టర్, దేవ సహాయం, మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ బాదావత్ సంతోష్ మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతూ.. మూడు మున్సిపాలిటీల్లో –మిగతా4లో..

# 45 కేసులు.. 15 ఏళ్ల పరుగు.. చివరకు చిక్కిన అంతరాష్ట్ర దొంగ

- ఆరోపణలకు కార్యాచరణే జవాబు..
- పట్టుదలతో నేరస్తుడిని పట్టుకొని పోలీసు ప్రతిభను చాటిన కల్వకుర్తి అధికారులు
- ఐదు రాష్ట్రాల్లో చోరీలు చేస్తూ 45 కేసుల్లో నిందితుడిగా ఉన్న నాగిరెడ్డి నేరచరిత్ర



నాగిరెడ్డి ( ఫైల్ )

**కల్వకుర్తి, జనవరి 7 ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం వీరాపూరానికి చెందిన తెలుగు మల్లెపూల నాగిరెడ్డి (33) కథ ఇది. 18వ ఏట నుంచే చోరీలకు అలవాటు పడిన నాగిరెడ్డి, జల్సాల కోసం నేరాలను జీవనాధారంగా మార్చుకున్నాడు. ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూల్ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో చోరీలు చేస్తూ, పోలీసులకు దొరికిన ప్రతిసారీ చాకచక్యంగా తప్పించుకోవడంలో ఆరితేరాడు.

పోలీసులను మోసగించిన నిందితుడు – పోలీస్ వ్యవస్థపై వచ్చిన మచ్చ 2023లో వైయస్సార్ కడప జిల్లా కొండాపురంలో పోలీసుల అదుపులోకి వచ్చిన నాగిరెడ్డి, అక్కడి నుంచి తప్పించుకోవడంతో ఏకంగా 11 మంది పోలీసులు సస్పెండ్ కావాల్సి వచ్చింది. ఈ ఘటన పోలీసు వ్యవస్థపై తీవ్ర విమర్శలకు దారి తీసింది. పోలీసుల నిర్లక్ష్యం" లోలపల కుమ్మక్కు" అంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి.

**రోడ్డు ప్రమాదమే కీలక మలుపు**

అనంతపురం జిల్లా విడపనకల్లు శివారులోని 42వ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నాగిరెడ్డి నేరచరిత్రను వెలుగులోకి తెచ్చింది. నిర్లక్ష్యంగా కారు నడుపుతూ ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొనడంతో, అందులో ఉన్నదంపతులు మృతి చెందారు. ప్రమాదంలో నాగిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, సీఐ మహానంది, నిందితుడు ప్రయాణిస్తున్న కారులో రూ.3 లక్షల నగదు, పలు ఆభరణాలు గుర్తించడంతో అనుమానాలు బలపడ్డాయి. విచారణలో అతని అంతరాష్ట్ర నేరచరిత్ర బయటపడటంతో ఆసుపత్రి వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం అరెస్టు చేసి ఉరవకొండ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

**కల్వకుర్తిలో మరోసారి తప్పించుకున్నాడు..**

రిమాండ్‌ఖైదీగా ఉన్న నాగిరెడ్డిని కల్వకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోనమోదైన పలు కేసుల విచారణ నిమిత్తం కల్వకుర్తికి తీసుకువచ్చారు. పోలీసులను బురిడీ కొట్టడంలో నిపుణుడైన నాగిరెడ్డి, ఇక్కడకూడా తన చాకచక్యంతో స్టేషన్ నుంచి తప్పించుకోవడం సంచలనం రేపింది. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది సస్పెండ్ అయ్యారు. కొంతమంది బాధితులు పోలీసులే కావాలనే పారిపోనిచ్చారు" అంటూ ఆరోపణలు గుప్పించారు.

**ఆరోపణలకు సమాధానంగా గట్టి చర్య**

ఆరోపణలు కల్వకుర్తి పోలీసుల పనితీరుపై ప్రశ్నార్థకం వేసినా, వారు వెనకడుగు వేయలేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌పోలీసులకు సవాలుగా మారిన ఈకేసులో మల్కాజిగిరి సీసీఎస్ పోలీసులు సీఐ జలంధర్ రెడ్డి బృందం- కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి బృందం పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు హైదరాబాద్ సరూర్‌నగర్ లింగోజీగూడ బస్తిలో నాగిరెడ్డి తన ప్రియురాలితో ఉన్నట్టు పక్కా సమాచారం అందడంతో, సంయుక్త బృందం పక్కా ప్రణాళికతో ఆపరేషన్ నిర్వహించింది. చివరకు, పోలీసుల నుంచి ఎన్నోసార్లు తప్పించుకున్న నాగిరెడ్డి ఈసారి తప్పించుకోలేకపోయాడు.

**పోలీసు వ్యవస్థపై విశ్వాసానికి బలం**

ఈ ఘటన ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. ఏ పోలీసు అధికారి తన ఉద్యోగాన్ని ఫణంగా పెట్టి నేరస్తులతో చేతులు కలపడు. తప్పిదాలు జరిగితే చర్యలు తప్పవు. కానీ వ్యవస్థ మొత్తం మీద అసత్య ఆరోపణలు చేయడం సరికాదు. చట్టానికి లోబడి పౌరుల ధన, మాన, ప్రాణాలను రక్షించడమే పోలీసుల ప్రధాన బాధ్యత. నాగిరెడ్డి ఉదంతం ద్వారా కల్వకుర్తి పోలీసులు ఒక స్పష్టమైన సందేశమిచ్చారు. తప్పు చేసినవారు ఎంతటి వారు అయినా, ఎంతకాలం తప్పించుకున్నా, చివరకు చట్టం ముందు తలవంచాల్సిందే. పోలీసుల కళ్లను కప్పి శాశ్వతంగా తప్పించుకోవడం అసాధ్యం. అనుమానాల నడుమ నిలబడ్డప్పటికీ, పట్టుదల, సమన్వయం, వృత్తి నిబద్ధతతో నిందితుడిని పట్టుకుని, పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పునరుద్ధరించిన కల్వకుర్తి పోలీసుల పనితీరు ప్రశంసనీయం.

## ఆర్టీసీ ప్రైవేట్ బస్సు డీజిల్ ట్యాంక్ లీకేజీ

**అప్రమత్తమైన డ్రైవర్.. తప్పిన ప్రమాదం**

**శాంతినగర్ బస్టాండ్‌లో బస్సు నిలిపివేత ఇబ్బందులకు గురైన ప్రయాణికులు**

**అలంపూర్ జనవరి 7, ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గం లోని శాంతినగర్ సమీపంలో ఆర్టీసీ ప్రైవేటు బస్సు (టీ. ఎస్.33 టీ.3436) డీజిల్ ట్యాంక్ లీకేజ్ కి గురైంది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును శాంతినగర్ లోని ఆర్టీసీ బస్టాండ్ కు తరలించి నిలిపివేశారు. దాదాపు గంట వరకు ఎలాంటి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఆర్టీసీ లీజుకు తీసుకున్న ప్రైవేట్ బస్సులు కండిషన్ లో ఉండకపోయినా అలాగే రోడ్లపై తిప్పుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. బస్సుల్లో ప్రయాణికులకు కల్పించాల్సిన కనీస వసతులు లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడం దురదృష్టకరమని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు కండిషన్ లో ఉన్న బస్సులను రోడ్లపై తిప్పాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## వెంకన్న బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం



బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల చేస్తున్న గ్రామస్తులు

**బిజినేపల్లి, జనవరి 7 ప్రభాతవార్త:** పాలెం శ్రీ అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులన్నారు. సర్పంచ్ బోనాసి రామకృష్ణ ,ఈవో సిహెచ్ రంగారావు, ఆలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల పోస్టర్ ను బుధవారం విడుదల చేసి మాట్లాడారు. పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 23వ తేదీన శ్రీవారి కల్యాణోత్సవం, 25న శ్రీ స్వామి వారి రథోత్సవం, 26న ఉద్దాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 20వ తేదీ నుండి 27వ తేదీ వరకు వెంకన్న బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు అభివృద్ధి కమిటీ గ్రామ ప్రజలతో చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, గంధం వెంకటేష్, గాడి సురేందర్, సుబ్రహ్మణ్యం, గోవిందు శేఖర్, బాలస్వామి, కుర్మయ్య, జగదీష్, జాకీర్ హుస్సేన్, మధుసూదన్, గోపాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సంస్కార భారతి వ్యవస్థాపకుడు జయంతి ఉత్సవాలు

**జడ్చర్ల, జనవరి 7 ప్రభాతవార్త :** బాదేపల్లి పట్టణంలో సరస్వతి శిశు మందిర్‌లో బుధవారం సంస్కార భారతీయ ఆధ్వర్యంలో సంస్కార భారతి వ్యవస్థాపకుడు యోగేంద్ర జి జయంతిని పురస్కరించుకొని యోగేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రాధాకృష్ణ మాట్లాడుతూ సంస్కార భారతికి కీలక పాత్ర పోషించిన వ్యవస్థాపకుడు యోగేంద్ర జి గొప్ప సంస్కారవంతుడు, సంస్కారంతోపాటు దేశ భక్తి నిండిన గొప్ప వ్యక్తిగా కళాకారులు వెలుగులోనికి తీసుకొచ్చారు.కళా ప్రదర్శనతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు దేశం భక్తి సమైక్యతను పెంపొందించారు.సమాజంలో కళలు కళాకారులను వెలికి తీయడంలో సంస్కార భారతి కీలకపాత్ర పోషించాడు. ఈ కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు మురళి, శిశుమందిర్ ప్రధాన ఆచార్యులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పుష్పలత, నిఖిత, రజిత, కళావతి, తేజస్విని, సాయి ప్రభ, లలిత, రాజశ్రీ, జయశ్రీలు పాల్గొన్నారు. చిత్రలేఖనంలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేయడం జరిగింది.

## ప్రజల పక్షాన పోరాడే పార్టీ ఎర్రజెండా



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం

**అమరచింత జనవరి 7, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన పోరాడే పార్టీ ఎర్రజెండా మాత్రమేనని సిపిఐ అమరచింత మండల కార్యదర్శి, అబ్రహం అన్నారు. బుధవారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి భూమికోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం ను గద్దె దించడానికి తెలంగాణ సాయుధ పోరాటంలో 4000 మంది కమ్యూనిస్టులు ప్రాణం త్యాగం చేసి అమరులయ్యారని వారు గుర్తు చేశారు. అలాగే భూమిలేని నిరుపేదలకు పదిలక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత కమ్యూనిస్టులకే దక్కిందని ఆయన అన్నారు. దేశంలో సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం అమలు చేయడానికి కమ్యూనిస్టు పార్టీ ఎనలేని కృషి చేసి విజయం సాధించామని ఆయన అన్నారు. భారత్ కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు సందర్భంగా ఖమ్మంలో ఈ నెల 18 న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారని కార్మికులు కర్షకులు వామపక్ష ప్రజాతంత్ర వాదులు భారీగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి, రవీందర్, భాస్కర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, ఎర్రన్న, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కల్వకుర్తి క్రీడా కుసుమం ఎంపిక



ఉమర్ ఫారుక్

**కల్వకుర్తి, జనవరి 7 ప్రభాతవార్త:**క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బచ్పన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ తిషా పేర్కొన్నారు. బచ్పన్ స్కూల్లో 6వ తరగతి చదువుతున్న ఉమర్ ఫారుక్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10 నుండి 14 వరకు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో నిర్వహించే సబ్ జూనియర్ ఖోఖో పోటీలలో ఉమర్ పార్కు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని వారన్నారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని వారు పేర్కొన్నారు. ఆటలు ఆడడం వల్ల శారీరక వ్యాయామంతో పాటు ఏకాగ్రత పోటీ తత్వం పెరుగుతుందని వారు పేర్కొన్నారు. చిన్న వయసులో జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన ఫరూక్ కుమార్‌ను పలువురు క్రీడాభిమానులు, క్రీడాకారులు తల్లిదండ్రులు అభినందించారు.

## దొంగ ఓట్లను తొలగించాలని కలెక్టర్‌కు వినతి

**గద్వాల జనవరి 7, ప్రభాతవార్త:** పట్టణంలోని 13వ వార్డులో దొంగ ఓట్లను తొలగించాలని జిల్లా కలెక్టర్ సంతోష్ కు వినతి పత్రం అందజేశారు. ప్రజా స్వామ్య రక్షణకు కీలక అడుగు అయిన టువంటి ఓట్లను తారుమారు చేస్తున్నా రని, ఇట్టి విషయంపై అధికారులు వెం టనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. 13వ వార్డు పరిధిలో అక్రమంగా నమోదు అయిన 135 దొంగ ఓట్లను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. 135 ఓట్లు ఇతర గ్రామాలకు చెందినవని స్పష్టంగా గుర్తించబడిందనీ,అందువల్ల వాటిని ఓటర్ల జాబితా నుండి తొలగించాలని కోరారు. వాస్తవంగా వార్డులో ఉన్నటువంటి ప్రజల ఓటు హక్కును కాపాడాలనీ, దొంగ ఓట్లను వెంటనే తొలగించాలని లక్ష్యంతో 13వ వార్డు నాయకులు అల్వాల కృష్ణయ్య గౌడ్, కుమ్మరి నారాయణ, సతీష్ , రమేష్ రెడ్డి, వీరేశ్ లు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

## నేడు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనండి

**సిపిఎం నాయకులు గోపాల్**



**దామరగిద్ద, జనవరి 7 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం తాండలో నేడు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా రైతాంగం పాల్గొనాలని సిపియం మద్దూర్ ఏరియా కార్యదర్శి ఉడ్మలగిద్ద గోపాల్ విజ్ఞప్తి చేసారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్ట్ చేపట్టడంలో భాగంగా పర్యావరణం పై ప్రజాభిప్రాయ సేకరణ కు వస్తున్న ఎన్జీటీ బృందానికి రైతులు తమ అభిప్రాయాలు సానుకూలంగా తెలియజేయాలని అన్నారు. గత పాలకుల నిరక్ష్యం కారణంగా మన ప్రాంతం సాగునీటికి నోచుకోలేదని అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా ప్రభుత్వం మారడంతో మనజిల్లాకు సాగునీటి ప్రాజెక్ట్ మంజూరు అయిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎకరాకు రూ.20లక్షల పరిహారం చెక్కులు రైతులకు అందజేయడం ప్రారంభించింది. ఈ నెల చివరి లోపు నిర్వాసిత రైతులకు పరిహారం అందుతుందన్నారు. జిల్లా రైతాంగం,మేధావులు,ప్రజాసంఘాల నాయకులు పాల్గొని అభిప్రాయాలు తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేయాలని కోరారు.

## మందిపల్లిలో ఇందిరమ్మ చీరల పంపిణీ

**ధన్వాడ, జనవరి 7 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని మందిపల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పుల్లగిరి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్హత కలిగిన మహిళలకు చీరలను అందజేశారు. సర్పంచ్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం ప్రజలందరికీ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారని ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యలలో గ్రామాలు

**నిధుల కొరతతో గ్రామపంచాయతీలు..**



వీపనగండ్ల బీసీ కాలనీలో రోడ్లపై పేరుకుపోయిన మురుగునీటి బురద



గోపాల్దిన్నె గ్రామపంచాయతీ భవనం



సర్పంచ్ దొడ్ల కవిత

**వీపనగండ్ల జనవరి 7,ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీలలో గత రెండు సంవత్సరాల నుండి నిధుల కొరతతో గ్రామాలలో సమస్యలు తిష్ట వేశాయని చెప్పవచ్చు. వీపనగండ్ల మండలంలోని 14 గ్రామపంచాయతీలలో మురుగునీటి సమస్య వీధిలైట్లు డ్రైనేజీలు తదితర సమస్యతో సతమతమవుతున్నాయి. వీటిని చక్కబెట్టడానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు అనేక ఇబ్బందులు పడుతూ గ్రామపంచాయతీలలో నిధులు లేకపోవడం వల్ల వారే స్వయంగా బాధ్యత తీసుకొని చిన్నచిన్న సమస్యలను పరిష్కరించడానికి తమ సొంత డబ్బుల ఖర్చు చేసి తాత్కాలికంగా సమస్యలు పరిష్కరించేవారు అయితే ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో నూతన సర్పంచులుగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత వారు గ్రామాలలో ఏవైనా సమస్యలు ఉన్న వాటిలో పనులు చేపట్టడం కోసం ప్రయత్నం చేద్దామన్న పంచాయతీలలో ఒక్క పైసా కూడా లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అయితే పంచాయతీ ఎన్నికలలో గెలుపొందడం కోసమే తాము అప్పులు చేసి ఖర్చు పెట్టినట్లు నూతనంగా ఎన్నికైన సర్పంచులు వాపోతున్నారు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు నిధులను మంజూరు చేసి గ్రామపంచాయతీలకు త్వరగా ఇస్తే పనులు చేపట్టడానికి అవకాశాలు ఉంటాయని వారు ప్రభుత్వాలను కోరుతున్నారు. అయితే వీధుల్లో ప్రధానంగా డ్రైనేజీ సమస్య బాగా ఉంది అని దీని కారణంగా సిసి రోడ్లపై మురుగునీరు చేరి పందులకు కుక్కలకు నిలయంగా మారాయని గ్రామాలలోని ప్రజలు అంటున్నారు దీని తోపాటు గ్రామాలలో వీధిలైట్ల సమస్య కూడా బాగా ఉన్నదని మౌలిక సమస్యలు పరిష్కరించడం కోసం కూడా పంచాయతీలలో నిధులు లేకపోవడం వల్ల సమస్యలు కూడా అలాగే ఉన్నాయని సర్పంచ్‌లు అంటున్నారు. త్వరగా ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీకి నిధులు మంజూరు చేస్తే మౌలిక వసతుల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని వారు అంటున్నారు.

## సంక్రాంతి పండగ ట్రాఫిక్ దృష్ట్యా ఫ్లై ఓవర్ పనుల పరిశీలన

**ముందస్తు ట్రాఫిక్ నియంత్రణకు ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ జానకి**



ట్రాఫిక్ నియంత్రణకు సూచనలు చేస్తున్న ఎస్పీ జానకి

**బాలానగర్, జనవరి 7 ప్రభాతవార్త :** సంక్రాంతి పండగ సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాదు నుండి సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల రాకపోకలు అధికంగా ఉండే నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, నేషనల్ హైవే-44 పరిధిలోని బాలానగర్ ఫ్లై ఓవర్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతున్న కారణంగా పండగలకు వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎన్‌హెచ్‌ఎఐ అధికారులకు, నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ప్రయాణికులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని, ముఖ్యంగా పనులను వేగవంతం చేయాలని, అవసరమైన చోట్ల స్పష్టమైన దిశా సూచికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండగ రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలు కొనసాగేందుకు పోలీస్ శాఖ సమన్వయంతో అవసరమైన ట్రాఫిక్ నిర్వహణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల భద్రత, సౌకర్యమే లక్ష్యంగా ముందస్తుగా ఈ సూచనలు ఇవ్వడం జరిగిందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్, బాలానగర్ ఎస్ఐ లెనిన్, బాలానగర్ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దత్తాత్రేయ, గ్రామ అధ్యక్షులు నర్సింలు, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు, ఫ్లై ఓవర్ కాంట్రాక్టర్‌తో పాటు బాలానగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## పండుగ వేళ ప్రాణాంతకంగా మారుతున్న చైనా మాంజా

**అయిజ పట్టణంలో పోలీసుల విస్తృత తనిఖీలు**





తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**అయిజ జనవరి 7, ప్రభాతవార్త :** ప్రజల, జంతువుల, పక్షుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిషేధిత చైనా మాంజా వినియోగం, అమ్మకాలపై జిల్లా వ్యాప్తంగా కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బుధవారం అయిజ పట్టణంలో పోలీస్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు.రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గాలి పతంగుల విక్రయానికి సంబంధించి, పట్టణ పరిధిలోని వివిధ దుకాణాలలో ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిషేధిత చైనా మాంజా నిల్వలు ఉన్నాయా లేదా అన్న అంశంపై ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ తనిఖీల సందర్భంగా ట్రైనింగ్ ఎస్సై కిరణ్ కుమార్ మాట్లాడుతూ, చైనా మాంజా అత్యంత ప్రమాదకరమైనదని, దీని వలన ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, పిల్లలు, పశుపక్షాదులు తీవ్రంగా గాయపడటంతో పాటు ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందన్నారు. అందుకే ప్రభుత్వం చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించిందని తెలిపారు. నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా చైనా మాంజాను అమ్మినా లేదా వినియోగించినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు పండుగ వేళ ప్రజలంతాఆనందంగాసురక్షితంగా సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని ముఖ్యంగా పిల్లలను చైనా మాంజాకు దూరంగా ఉంచాలని పోలీసులు సూచించారు. గాలి పతంగులు ఎగరేసే సమయంలో సురక్షితమైన దారాలనే ఉపయోగించాలని కోరారు అయిజ పట్టణంలో ఎక్కడైనా నిషేధిత చైనా మాంజా అమ్మకాలు లేదా వినియోగం జరుగుతున్నట్టు సమాచారం ఉన్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు స్పష్టం చేశారు తనిఖీల్లో కానిస్టేబుళ్ల ఆకాష్, రవి తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం

**ఎస్‌టియు రాష్ట్ర అదనపు కార్యదర్శి పోకల సతీష్**




హైస్కూల్‌లో ఎస్‌టియు టిఎస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

**ఉప్పునుంతల,జనవరి 7 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్‌టియు టిఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఎస్‌టియు రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ పోకల సతీష్ అన్నారు. బుధవారం స్థానిక పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పునుంతలలో అ పాఠశాల కాంప్లెక్స్ రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఎస్‌టియు టిఎస్, క్యాలెండర్, డైరీ 2026ను ఎస్‌టియు టీఎస్ రాష్ట్ర అడిషనల్ సెక్రెటరీ పోకల సతీష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎస్‌టియు టిఎస్ యూనియన్ ఉపాధ్యాయుల సమస్యలపై చేస్తున్న పోరాటం అభినందనీయమని అన్నారు. అనంతరం ఎస్టియు రాష్ట్ర నాయకులు పోకల సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు పదివేల కోట్ల పైగా పేరుకుపోయాయని, ప్రతినెల ప్రభుత్వం విడుదల చేస్తున్న రూ. 700 కోట్లు సరిపోవడం లేదని, ప్రతినెల 300నుండి 400 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ లో ఉంటున్నాయని, మొత్తం పెండింగ్ బిల్లులు చెల్లించడానికి దాదాపు 50 నెలలు పడుతుందని అన్నారు. అందుకని ప్రతి నెల పెండింగ్ బిల్స్ రూ. 1500 కోట్లు చెల్లించాలని, అదేవిధంగా గత 4 నెలల నుంచి సిపిఎస్ డిఏ ఏరియర్స్ చెల్లించడం లేదని వాటిని తక్షణమే చెల్లించి పెండింగులో ఉన్న డిఏలను ప్రకటించి 60 శాతం ఫిట్మెంట్ తో ఉన్న పిఆర్‌సి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో వారితో పాటు ఎస్టియు టీఎస్ మండల అధ్యక్షులు కపిలవాయి విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా నాయకులు వీరోజు రాజు, శ్రీనివాసులు, బిల్కిస్,శ్యామల, కవిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న నిల్వల కోసం గోదాం కేటాయింపు



మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లాను సన్మానిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ జనవరి 7, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్నటువంటి టన్నుల కెపాసిటీ కల గోదామును మొక్కజొన్నల నిల్వల కోసం వనపర్తి వీర అసోసియేషన్ శాఖకు అప్పగించడం జరిగిందని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా తెలిపారు. రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు అనపర్తి వ్యవసాయ శాఖ వెల్ఫేర్ అసోసియేషన్ కెపాసిటీ గల గోదామును ఆదేశించడంతోపాటుగా తక్షణమే మార్కెట్ యార్డ్ ఆవరణలో మొక్కజొన్న నిలువల కోసం రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునేందుకు అన్ని రకాలుగా తోడ్పాటు అందించడం జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా తెలిపారు. బుధవారం రోజు మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్నటువంటి గోదాముకు ప్రత్యేక పూజలు నిర్వహించడం తరం అనపర్తి జిల్లా అధికారులకు అప్పచెప్పుతున్నట్లుగా ఎందుకు సంబంధించి మొక్కజొన్న నిలువల కోసం వాడుకోవడమే కాకుండా మొక్కజొన్నల నిలువలను ఎగుమతులు దిగుమతుల కోసం ప్రత్యేకంగా కేటాయించేటువంటి హమాలీలకు ప్రత్యేక రేటు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భక్తతు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు తులసిరాజు యాదవ్ ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ ఆత్మకూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు కాంగ్రెస్ నాయకులు గాలి పంపు శ్రీనివాసులు, దామోదర్, కరణ్ లాల్, గణేష్, గడ్డమీద అశోక్, తదితరులతోపాటుగా ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది మరియు హమాలీలో తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ చైర్మన్ రహమతుల్లాను ప్రత్యేకంగా సన్మానించారు.

## అలంపూర్ డయాలిసిస్ కేంద్రాన్ని సందర్శించిన నిమ్స్ నెఫ్రాలజీ బృందం



హాస్పిటల్ సందర్శించిన డాక్టర్లు

**అలంపూర్ జనవరి 7, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డయాలిసిస్ కేంద్రాన్ని బుధవారం నిమ్స్ నెఫ్రాలజీ డాక్టర్ బృందం సందర్శించింది. బృందంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సయ్యద్ పాషా, నిమ్స్ అసోసియట్ ప్రొఫెసర్ నెఫ్రాలజీ డాక్టర్ పాయల్, డాక్టర్ అభినయ, మరియు క్లస్టర్ మేనేజర్ సౌత్ రీజియన్ అపెక్స్ కిడ్నీ కేర్ శిబ్గతుల్ల, ఇక్కడ ఉన్న పరిసరాలను పరిశీలిస్తూ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పేషెంట్ తో మాట్లాడి ఇక్కడి డయాలిసిస్ సేవల ఫీడ్ బ్యాక్ ను తీసుకుంటూ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపర్వైజర్ శ్రీ లలిత , డయాలిసిస్ ఇంచార్జ్ మహేష్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

## పాడి పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

**దామరగిద్ద,జనవరి 7 ప్రభాతవార్త :**జిల్లా పశువైద్య,పశు సంవర్ధకశాఖ సహకారంతో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉడ్మలగిద్ద గ్రామంలో పాడిపశువులలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సత్యమ్మ గోపాల్ ప్రారంభించారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డా.బి. ఈశ్వర్‌రెడ్డి కోరారు.పశువులలో గర్భకోశ సంబంధిత వ్యాధులు, కృత్రిమగర్భధారణపై రైతులకు డా.శ్రీనివాస్ అవగాహన కల్పించడం జరిగింది.సూపర్ వైజర్ ఉత్తేజ్ కుమార్ , గోపాలమిత్రలు భీంశప్ప, కనకప్ప, నర్సిములు, రైతులు పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీ తరగని స్ఫూర్తి




శివాజీ విగ్రహ ఏర్పాటుకు నగదు అందజేస్తున్న అయ్యన్న

**బిజినేపల్లి జనవరి 7 ప్రభాతవార్త:** తరాలు మారినా స్ఫూర్తి తర గని పేరు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని, హైందవ జాతికి తాను చేసిన సేవ, త్యాగం మరువలేనిదని బి.జె కన్స్ట్రక్షన్స్ ఎండి మేకల అయ్యన్న అన్నారు. గుడ్ల నర్వ శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.శివాజీ పేరు విన్నా, రూపం చూసినా, ప్రతి హిందువుకూ తన కర్తవ్యం గుర్తొస్తుంది అని, నేటి యువత ఆలయాలను విద్యాసంస్థలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బి.జె కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు కోసం ప్రస్తుతం రూ. 2.50 లక్షలను సేవాసమితి అధ్యక్షులు శాంతి కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ లేట్ల బాలస్వామిని, అయ్యన్నను గ్రామ యువకులు సన్మానించారు. కార్యక్రమంలో రాందాస్, అఖిలేష్ ,శ్రీశైలం, లింగం, బంగారయ్య, పర్వతాలు, గూడ కాశీం, లక్ష్మీకాంత్, రామకృష్ణ , కత్తి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ లిస్టులో తప్పు తడకలను సరి చేయాలి



ఓటర్ లిస్ట్ లను పరిశీలిస్తున్న టిఆర్ఎస్ నాయకులు

**అమరచింత జనవరి 7, ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ ఎన్నికల ఓటర్ లిస్టులలో అధికారులు తప్పులతడకగా చేశారని అమరచింత టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, అక్కల నరసింహులు గౌడ్ అన్నారు. బుధవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ లిస్టులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న అధికారులు ఓటర్ లిస్టులో ఉన్న లోపాలను సరిచేయాలని ఆయన అధికారులను కోరారు. ఓటర్ లిస్టులో తప్పులను సరి చేయడానికి మున్సిపల్ ఉన్న పది వార్డులకు సంబంధించిన టిఆర్ఎస్ కార్యకర్తలు అధికారులకు సహకరిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి, చిన్న బాలరాజ్, షంషీర్, సుజంధర్, హర్ష వెంకటేష్, తెలుగు రమేష్, నబి, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తాం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

**వెల్దండ, జనవరి 7ప్రభాతవార్త:** గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పేర్కొన్నారు.బుధవారం మండల కేంద్రంలోని 9 వార్డు మెంబెర్ ముదిగొండ కవిత రమేష్‌లతో కలిసి సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అభివృద్ధి పనులను ప్రారంభించి వార్డుల్లో ఉన్న ముళ్ల చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందుకు నడిపిస్తామన్నారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్రశీను ముదిరాజ్, పురుషోత్తమా చారి, పుల్లయ్య, కిష్టల్, మట్ట నాగేశ్వర్ గౌడ్, గోసుల కొండలు, ఖలీల్, తరుణ్, మట్ట భరత్ గౌడ్, వేణు కుమార్, రామకృష్ణ, నాగార్జున గౌడ్, పంచాయతీ కార్యదర్శి గిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాసరావు



మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాసరావు

**లింగాల, జనవరి 7 ప్రభాతవార్త:** మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం లింగాల కేంద్రంలోని ఆయా గ్రామాల మత్స్యకారుల సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కులవృత్తులను కాపాడే విధంగా రాష్ట్ర ప్రభుత్వంచర్యలు తీసుకుంటుందన్నారు. మత్స్య కారుల బలోపేతానికి వందశాతం రాయితీతో కూడిన చేప పిల్లలను సరఫరా చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ, వెంకటయ్య, యువజనకాంగ్రెస్ అధ్యక్షులుచెంచేటి శివ, మార్కెట్ డెరెక్టర్ ముక్తార్, ఆయా గ్రామాల సర్పంచులు మంజుల సుభాష్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, వెంకటయ్య, రవి, సలేశ్వరం,లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నవ వసంతానికి నాంది విద్యాప్రగతికి వారది

తపస్ జిల్లా మాజీ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి కృష్ణా రెడ్డి

**దామరగిద్ద, జనవరి 7 ప్రభాతవార్త :** తపస్ నూతనంగా ఆవిష్కరించిన 2026 క్యాలెండర్‌లో వినూత్న అంశాలను పొందుపరచడం జరిగింది. ప్రతి నెల జరిగే తల్లిదండ్రుల సమావేశం, విద్యార్థుల నో బ్యాగ్ డే తేదీలను, బడిబాట ప్రచారం, ప్రభుత్వ బడుల గొప్పతనం గురించి ప్రత్యేకంగా పొందుపరుస్తూ విద్యా ప్రగతికి వారధిగా రూపొందించడం జరిగిందని దామరగిద్ద మండల విద్యాధికారి కృష్ణారెడ్డి అన్నారు. దామరగిద్ద మండలంలో జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎంఈఓ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నిరంతరం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడడమే తపస్ లక్ష్యమని అన్నారు. మండలంలోని ప్రతి పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులకు క్యాలెండర్లు అందిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, కార్యదర్శులు అంబరీష్, కరుణాకర్ జిల్లా నాయకులు శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి, కనకప్ప, సక్సేనా,జ్యోతి, శ్రీనాథ్,మల్లికార్జున్, రాణి, శ్రావణి, బాలమురళి, మౌనిక, చంద్రకాంత్, గోపాల్, అరుణ, నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## మద్దూర్ న్యూ లగాన్ టీం ఘన విజయం



విజేతలకు షీల్డులు అందజేసిన దృశ్యం

**మద్దూర్, జనవరి 7 ప్రభాతవార్త :** గుళ్ల నరసింహ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మద్దూర్ ప్రీమియర్ లీగ్-4 క్రికెట్ టోర్నమెంట్‌లో మద్దూర్ న్యూ లగాన్ టీం ఘన విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. నారాయణపేట జిల్లా పరిధిలోని 11 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్ మద్దూర్ న్యూ లగాన్ టీం-తిర్లపురం నారి బొర్రా టీంల మధ్య హోరాహోరీగా సాగింది. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన మద్దూర్ న్యూ లగాన్ టీం నిర్ణీత 12 ఓవర్లలో 70 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన తిర్లపురం నారి బొర్రా టీం 61 పరుగులకే ఆలౌట్ అయి పరాజయం పాలైంది. దీంతో మద్దూర్ న్యూ లగాన్ టీం 9 పరుగుల తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన పీకేకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు, టోర్నమెంట్ మొత్తంలో నిలకడైన ఆటతీరుతో ఆకట్టుకున్న చందుకు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందజేశారు. విజేత జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.70,000 నగదు బహుమతి,రన్నరప్ జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.35,000 నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మోనాపూర్ సర్పంచ్ శ్రీదేవి రవికుమార్, గోవిందు, కృష్ణగౌడ్, అశోక్‌గౌడ్, మల్లికార్జున, మహేందర్ రెడ్డి, యాసిన్, చందు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్‌కు ఘన సన్మానం



సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సన్మానిస్తున్న దృశ్యం

**దేవరకద్ర, జనవరి 7 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం, వెంకటాయపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, ఉప సర్పంచ్ మోహన్‌లను జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. బుధవారం వెంకటాయపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శేఖర్, అంజద్ అలీ, అజయ్, కలిసి నూతన ఎన్నికైన గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, ఉపసర్పంచ్ మోహన్‌లను శాలువతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల కాంపౌండ్ వాల్,మంచినీటి సమస్య గురించి తెలిపి, పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులను సన్మానించిన సర్పంచ్

**ఉప్పునుంతల, జనవరి7 ప్రభాతవార్త:** గత నెలలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో అధికారులు పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిపారని ఉప్పునుంతల సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచు పంచాయతీ పోరులో అధికారులు విజయవంతంగా కొనసాగేందుకు పూర్తిస్థాయిలో కృషి చేశారని, మీ కృషిని గ్రామ సర్పంచులు మరువలేనని ఆయన అన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ సర్పంచ్ లకు సహకరించి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని, కొంతమందికి గ్రామపంచాయతీ పాలన పట్ల అవగాహన లేకున్నా పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పిస్తూ వారికి సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.అనంతరం ఎంపిడిఓ వరుణ్‌తేజ, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు ,ఐకెపి ఏపిఎం బాలచందర్‌ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులుతో పాటుమండల యువజన కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు మేడమోనిభాస్కర్, పెద్దాపూర్ ఉప సర్పంచ్ నరేష్‌యాదవ్, వెల్టూరు యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ శ్రీశైలం, నాయకులు పాత్కుల రామచంద్రయ్య, శేఖర్‌గౌడ్, తాడూరు వార్డ్ మెంబర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**చిన్న చింతకుంట,జనవరి7 ప్రభాతవార్త:**గ్రామాలలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు తెలిపారు. బుధవారం బండర్‌పల్లి, లాల్‌కోట చౌరస్తాలోని రహదారులపై చెత్త వేయడంపై దుకాణదారులకు అవగాహనకల్పించారు.దుకాణదారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని చెత్తకుండీని ఏర్పాటు చేసుకొని దానిలోనే ప్లాస్టిక్ కవర్లు ,చెత్తను వేసుకోవాలని సూచించారు.ఎవరైనా రోడ్లపై చెత్తని వేస్తే దుకాణదారులకు జరిమానాలు వేస్తామని ఆయన తెలిపారు.



పారిశుద్ధ్యం పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు

## సంక్రాంతి కానుకగా కొత్త పీఆర్సీ అమలు చేయాలి

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్



పిఆర్‌టియు టిఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**దేవరకద్ర,జనవరి7 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయులకు కొత్తపీఆర్సీ నివేదికను సత్వరమే ప్రకటించి అమలు చేయాలని పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లక్ష్మీపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కెకె శ్రీనివాస్, పిఆర్‌టియు టిఎస్ దేవరకద్ర మండలశాఖ మహిళా కార్యదర్శి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం. ఎస్.కల్పనలతో కలిసి బుధవారం లక్ష్మీపల్లి ప్రాథమిక,ఉన్నత పాఠశాలల్లో పిఆర్‌టియు టిఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2026 కు సంబంధించి గోడ, టేబుల్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన స్థిరీకరణకు సంబంధించి పిఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి రెండున్నర ఏళ్ళు గడిచినా పిఆర్సీ అమలు చేయక పోవడం, పెండింగ్ లోఉన్నఅయిదు విడతలకరవు భత్యాలను(డిఏ) సైతంప్రకటించని కారణంగాఉద్యోగ,ఉపాధ్యాయులు తీవ్రఇబ్బందులకు గురవు తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జిపిఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్స్, టిఎస్ జిఎల్ఐ, సరెండర్, మెడికల్ బిల్లులను తక్షమే మంజూరు చేయాలని చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షనరీ బెనిఫిట్స్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుటుంబసమగ్ర సర్వేకు సంబంధించి విధులు నిర్వ హించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ను సత్వరమే అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ దేవరకద్ర మండల శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి దోమ శంకర్,ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌యంలు, కెకె శ్రీనివాస్, ఎస్.కల్పన, ఉపాధ్యాయులు మురళీధర్, మదన్ మోహన్, కావలి సుజాత పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన జరగాలి



విద్యార్థి పూజను సత్కరిస్తున్న ఎంఈఓ, తదితరులు

**చిన్నచింతకుంట, జనవరి 7 ప్రభాతవార్త :** విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన అందించాలని మండల విద్యాధికారి మురళీ కృష్ణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల వనరుల భవనంలో ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలకు అనుగుణంగా పెంపొందించి ఎఫ్ఎల్ఎస్ పై మూడో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలకు సంసిద్ధులను చేయాలని ఆయన సూచించారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఇప్పటినుంచి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లో రాణించేలా చూడాలన్నారు. అన్ని అంశాలలో విద్యార్థులను సమర్థులుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. తపస్, పిఆర్‌టియు తెలంగాణ, టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు వడ్డేమాన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్టులో పాల్గొని ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని పూజను మండల విద్యాశాఖ తరఫున విద్యాధికారి మురళీకృష్ణ పదవ తరగతి విద్యార్థులతో సమావేశమై గణిత శాస్త్ర ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. అనంతరం విజేతను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జిహెచ్ఎం మోహన్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయులునాగరాజు,అన్నపూర్ణ తదితరులు ఉన్నారు. మండల విద్యా వనరుల కేంద్రం చిన్న చింతకుంట ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో గౌరవ మండల విద్యాధికారి మురళి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలకు అనుగుణంగా అన్ని సామర్థ్యాలను పెంపొందించి ఎఫ్ఎల్ఎస్ మూడో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలకు సంసిద్ధులను చేయాలని వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదును పెంచడానికి ఇప్పటినుంచి ప్రణాళిక తయారు చేసుకోవాలని, విద్యార్థులకు ప్రతి రోజు క్రీడలు నిర్వహించాలని విద్యార్థులలో అన్ని అంశాలలో మౌలిక సామర్థ్యాలు పెంపొందించేటట్లు చేయాలని సూచించడం జరిగింది. టిపియుఎస్ (తపస్),పిఆర్‌టియు టిఎస్, యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్లను ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలి

● వీసీలో పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



వీడియో కాన్ఫరెన్స్ ను తిలకిస్తున్న అధనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, అధికారులు

**గద్వాల జనవరి7, ప్రభాతవార్త:** ఖరీఫ్ 202526 ధాన్యానికి సంబంధించిన నగదు వెంటనే రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులకు ఆదేశించారు.గురువారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో ధాన్యం చెల్లింపులు, సిఎంఆర్ డెలివరీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిటిసి నుండి జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, డిఎస్ఓ స్వామి కుమార్, జిల్లా మేనేజర్ తదిత రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల కమిషనర్ మాట్లాడుతూ ఖరీఫ్ 202526 ధాన్యానికి సంబంధించిన నగదు వెంటనే రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లులో నిలువ ఉంచిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రబి 202425 పంటకు సంబంధించిన సీఎంఆర్ ను ఫిబ్రవరి, 28 వరకు డెలివరీ పూర్తి చేయాలని సూచించారు. ఖరీఫ్ 202526 పూర్తయిన కొనుగోలు కేంద్రాల ధాన్యం మరియు గోనె సంచుల రికాన్సీలేషన్ జనవరి, 31 లోపు పూర్తి చేసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

## గ్రామాభివృద్ధికి సహకరించాలి

గ్రామసభలో సర్పంచులు



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ మంగమ్మ

**ఉప్పునుంతల, జనవరి 7 ప్రభాతవార్త:** గ్రామంలో నిర్వహించే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి గ్రామ ప్రజలు, అధికారులు, వార్డు సభ్యులు సహకరించాలని తిరుమల పూర్ సర్పంచు బరిగేల శ్రీకాంత్ గ్రామ సభలో కోరారు. బుధవారం మండలంలోని తిరుమలాపూర్‌లో సర్పంచులు బరిగేల శ్రీకాంత్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోజరిగిన గ్రామసభలో సర్పంచు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం అందుబాటులో ఉండి సేవలందిస్తామని, తమకు అధికారులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ గ్రామ సభలో సర్పంచు శ్రీకాంత్ తో పాటు ఉప సర్పంచ్ రాస మల్ల రేణయ్య, పంచాయతీ కార్యదర్శి నాగేష్, జిపిఓ, వైద్య సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**దేవదారి కుంట తండాలో:** గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని మండలంలోని దేవదారి కుంట తండా గ్రామ సర్పంచు మునావత్ మంగమ్మ కోరారు. బుధవారం మండలంలోని దేవదారి కుంట తండాలో గ్రామ సర్పంచు మునావత్ మంగమ్మ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలపై సభ్యులు విస్తృతంగా చర్చించి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన అంశాలపై తీర్మానాలు చేశారు. గ్రామపంచాయతీ నూతన భవనం నిర్మాణంతో పాటు జయరాం తండా, గుట్టమీది తండా గ్రామ మహిళా సమాఖ్య భవనం నిర్మాణం కోసం స్థలాల సేకరణ, మంచి నీటి సరఫరా, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ, వీధి దీపాల వంటి అంశాలపై గ్రామసభలో చర్చించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ మునావత్ మంగమ్మ రతన్ సింగ్,ఉప సర్పంచు సభావట్ మంగమ్మ చంద్రు, పంచాయతీ కార్యదర్శి పోస్టుల చందర్‌లాల్, పాఠశాల హెచ్ఎం రత్న ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రత్లావత్ కృష్ణ, వార్డు సభ్యులు, అంగన్‌వాడి కార్యకర్తలు, తండావాసులు పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**మద్దూర్, జనవరి 7 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కోస్గి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదులు,మద్దూర్ ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాలవాహనదారులు సీట్ బెల్ట్ వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అధిక వేగంతో వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం వంటి నిర్లక్ష్య చర్యల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించినట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడమే ప్రాణ రక్షణకు మార్గమని,ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సహకరించి రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు తోడ్పడాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న గిరిజన నాయకులు సర్పంచులు

## నెరవేరిన దశాబ్దాల గిరిజనుల కల

**బిజినేపల్లి, జనవరి7 ప్రభతవార్త:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో దశాబ్దాల కాలంగా ఎదురుచూసిన గిరిజనుల కలను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డిలు నిజం చేశారని గిరిజన సంఘాల ఐక్యవేదిక హర్షంవ్యక్తం చేసింది. గిరిజన లంబాడ జాతికి తానున్నానంటూ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన అనంతరం సంతు సేవాలాల్‌మహారాజ్ భవన నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలు విడుదల చేయడం అభినందనీయమన్నారు.పూలే అంబేద్కర్‌చౌరస్తాలో ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వంలో గిరిజన అభివృద్ధి కోసం పట్టింపు లేకుండా వ్యవహరించారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోబంజారా భవన నిర్మాణానికి మూడు కోట్లు కేటాయించడం, గిరిజన తండాలకు రోడ్లు మార్గాలు వేయడం గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణం అభివృద్ధికి సూచికలుగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన లంబాడీ సర్పంచులు కేతావత్ సరోజ మాన్య నాయక్, మునీందర్, గోపాల్ నాయక్ , గోరిభాయి, ఆర్. గోపాల్, కృష్ణ , కాట్రావత్ బుజ్జి చందు లాల్, లలిత భాయి, రాట్లవత్ విజయ దిప్ల, పూల్యానాయక్, రామచందర్, నాయకులు మూడవత్ గోవింద్ నాయక్ మూడవత్ హన్మ్య ,ఆంగోత్ లక్ష్మణ్ , పాండు బదావత్ పాండు నాయక్ , పాండు నాయక్ పట్లవాట్ రాజు, దేవుల నాయక్, రవి నాయక్ మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామ సభలతో సమగ్ర అభివృద్ధి

**బిజినేపల్లి, జనవరి7 ప్రభాతవార్త:** మన దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని గ్రామ సభలతో గ్రామ సమగ్ర అభివృద్ధి చేసుకుందామని సర్పంచ్ లేట్ల బాలస్వామి అన్నారు. గుడ్ల నర్వ గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ స్వరాజ్యం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేసింది. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలను రాజ్యాంగబద్ధ సంస్థలుగా తీర్చిదిద్ది గ్రామ స్థాయి ప్రజాస్వామ్య వికేంద్రీకరణ పరిపాలనకు నాంది పలికింది అన్నారు. గ్రామంలో సిసిరోడ్లు, గ్రావెల్‌రోడ్లు, నీటి వసతి, విద్యుత్ దీపాలు మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ వంటి కార్యక్రమాలపై చర్చించారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై పలువురు వినతి పత్రం అందించడంతో త్వరలోనే రోడ్డు నిర్మాణం కోసం కృషి చేయనున్నట్లు చెప్పారు.మహిళల అభివృద్ధి కోసం మహిళా సంఘా భవన నిర్మాణానికి కృషి చేయనన్నట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యమ్మ, ఉప సర్పంచ్ శివప్రసాద్, 12 మంది వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**బిజినేపల్లి, జనవరి7 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)2026 క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారి రఘునందన్ శర్మ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కొరకు ప్రతిఒక్క ఉపాధ్యాయుడు సమయపాలన, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తపస్ అధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ వారు పొందే హక్కులను సాధించుకోవడానికి కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తపస్ అధ్యక్షులు హరికృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులుభాస్కర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, నిరంజన్, మహిళా కార్యదర్శి యశోద, భాగ్యలక్ష్మి ్మ, మండల కార్యదర్శులు మహేష్ బాబు, వెంకటేష్, రామకృష్ణ, అశోక్ ,కుమార్ శ్రీను రాధాకృష్ణ, ఎమ్మార్సీ సభ్యులు పాల్గొన్నారు.

## మైసమ్మ జాతర హుండీ లెక్కింపు

**నవాబుపేట,జనవరి 7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాకర్లపాడు పర్వతాపూర్ మైసమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయఈవో నర్సింలు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో లెక్కించారు. నాలుగు రోజులుగా జరిగిన శ్రీమహిమాన్విత పర్వతాపూర్ మైసమ్మ హుండీ మొత్తం ఆదాయం,1లక్ష 11 వేల 458 రూపాయలు నగదు రాగా 6 గ్రాములగోల్డ్, 907 గ్రాముల వెండి కానుకలు వచ్చినట్లు తెలిపారు. ఫతేపూర్ మైసమ్మ జాతరలో భాగంగా 4 రోజులుగా అమ్మవారి జాతర జరిగింది.అమ్మవారి మహోత్సవాలను విజయవంతం చేసిన భక్తులకు గ్రామ ప్రజా ప్రతినిధులకు ధన్యవాదా లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, జిల్లా ఎన్విరాన్మెంట్ అధికారులు, గ్రామస్తులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

**ఉప్పునుంతల, జనవరి7 ప్రభాతవార్త:** ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన అచ్చంపేటకు చెందిన పెళ్కూరి అమృతయ్య అనే వ్యక్తికి అచ్చంపేట మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు.ఈసందర్భంగా వాహనచోదకులకు మోటార్ చట్టం నియమాలు,రోడ్డు భద్రతనియమాలువిధిగా పాటించాలని సూచించారు.

## ఓట్ల లెక్కింపులో అన్యాయం జరిగిందంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

**అయిజ జనవరి 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామంలో గత నెలలో జరిగిన స్థానిక సర్పంచ్ ఎన్నికలలో 101 ఓట్లు కౌంటింగ్ చేయకుండానే అభ్యర్థిని గెలుపొందినట్టు అధికారులు ప్రకటించారని స్వతంత్ర అభ్యర్థి యు,నరసింహులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కౌంటింగ్ పూర్తయిన మరుసటి రోజు ఆర్ఓ ఇచ్చిన నివేదికలో 101 తేడాను తాము గమనించామని ఈ విషయమై స్థానిక ఎంపీడీవో మరియు జిల్లా కలెక్టర్లకు కూడా ఫిర్యాదు చేశానని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తమకు ఎన్నికల సంఘం న్యాయం చేస్తున్న వారాలసతో ఫిర్యాదు చేశామని న్యాయం జరగని పక్షంలో కోర్టుకు వెళ్లి న్యాయాన్ని కోరుదామని మీడియా ముందు తెలిపారు. అలాగే కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన సంఘటనపై జిల్లా ఎన్నికల అధికారి శ్రీకాంత్ ఆర్వో శ్రీహరికి మెమో జారీ చేసినట్లు వారు తెలిపారు.

## సర్పంచ్‌లకు ఘన సన్మానం

**శ్రీరంగాపూర్, జనవరి7 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నూతనంగా ఎన్నికైన సర్పంచులతో ప్రత్యేక పరిచయ కార్యక్రమం, అవగాహన సదస్సు ఎంపీడీవో నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తహసిల్దార్ రాజు, ఎస్సై హిమబిందు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులు గ్రామ మండల అభివృద్ధి శాంతిభద్రతలపై మండలంలోని సర్పంచ్లకు దిశ నిర్దేశం చేయడం జరిగింది. అనంతరం సర్పంచ్‌లను శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్లు ముంత మద్దిలేటి శ్రీరంగాపూర్, విజయ్‌కుమార్‌రెడ్డి కంబాలాపూర్, రాముడు జానంపేట, వెంకటయ్య యాదవ్ షేర్ పల్లి, మహాదేవ నగరాల, సుజాత రాజశేఖర్ నాగసానిపల్లి, భారతీయ ఎల్లయ్య గౌడ్ వెంకటాపూర్, శిరీష మధు తాటిపాముల,మండల పరిషత్ సిబ్బంది ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**చిన్నచింతకుంట, జనవరి7 ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళ్తూ ట్రక్కును ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో చిన్న చింతకుంట మండలం పర్దిపూర్ గ్రామానికి చెందిన కావలి నర్సింలు, కురువ శివకుమార్‌లు మృతి చెందడంతో వారి మృతదేహాలు బుధవారం గ్రామానికి రావడంతో వారికుటుంబ సభ్యులు,బంధువుల రోదనలతో మిన్నంటాయి. స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి వారి పార్థివదేహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ కొండ ప్రశాంత్ రెడ్డి, నాయకులు నంబిరాజు, కురువ రమేష్, దశరథ్ లతోపాటు గ్రామ సర్పంచ్ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## నేడు పియులో ప్లేస్మెంట్ డ్రైవ్

**మహబూబ్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త:** కే 12 టెక్నో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో హైదరాబాద్, మహబూబ్‌నగర్ బ్రాంచ్ కోసం పిఆర్‌ఓలు ఫ్రమ్‌గా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాలమూరు విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డా.డి మధుసూదన్ రెడ్డి, ప్రొ డా. గాలెన్న, ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. ఎస్ఎన్ అర్జున్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నేడు యూనివర్సిటీలోక్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించబడుతుంది. పాలమూరు విశ్వవిద్యాలయంలో ఎంబిఏ, ఎంసిఏ పూర్తి చేసిన విద్యార్థుల కోసం ప్రత్యేకం. కాబట్టి హాజరు కావడానికి ప్రయత్నించాలని వారు సూచించారు. (ప్రొబేషన్ వ్యవధి చెల్లింపు 18 + ప్రోత్సాహకాలు)రెజ్యూమ్‌తో హాజరు కావాలి (బ్యాచ్ 2024 మరియు 2025 ఎంబిఎ, ఎంసిఎ పూర్తయింది) మరిన్ని వివరాల కోసం 9849445877 ను సంప్రదించాలని కోరారు.

